# మిర్చి రైతు.. అప్పుల బాట

- తగ్గిన మిర్చి ధరలతో ఆందోళన
- పెరిగిన పెట్టుబడితో అప్పులపాలు
- తెగుళ్ల దెబ్బకు తగ్గుతున్న దిగుబడులు
- కూలీల రేట్లతో తప్పని ఇబ్బందులు
- గత ఏడాది ధర రూ.18,000
- ప్రస్తుత ధర రూ.10 వేలలోపే


వెనిగండ్లలో నల్లి ఆశించడంతో తెగులు సోకిన మిరప పైర్లు

పెదకాకాని: రైతులు నష్టాల బాట పడుతున్నాడు. కోటి ఆశలతో ఈ ఏడాది రైతులు రెక్కలు ముక్కలు చేసుకుని మిర్చి పంట సాగు చేశారు. ప్రస్తుతం రోజురోజుకు మార్కెట్లో మిర్చి ధరలు పతనం కావడంతో వారు ఆందోళన చెందుతున్నారు. మొదటి నుంచి ఉమ్మడి తెలుగు రాష్ట్రా ల్లోనే మిర్చి పంట సాగులో గుంటూరు జిల్లాకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. మండలంలోని పెదకాకాని, కొప్పురావూరు, వెనిగండ్ల, తక్కెళ్లపాడు తదితర గ్రామాల్లో రైతులు ఈ ఏడాది మిర్చి సాగు చేశారు.

**పెట్టుబడి ఇలా..**

ఈ ఏడాది మిర్చి 178.60 ఎకరాలలో సాగు చేశారు. సాగు పెట్టుబడి పెరిగింది. ప్రభుత్వ అంతంతమాత్రమే సాయం అందించింది. చీడపీడలు, దోమ, తెగుళ్ల నుంచి పంటను రక్షించుకోవడానికి రైతులు ఇష్టానుసారంగా రసానిక ఎరువుల వాడారు. పెట్టుబడి రెండింతలు పెరిగింది. మిరప మొక్క కొనుగోలు నుంచి నాటు వేసి కోత వరకు ఎకరానికి రూ.1,80,000 పెట్టుబడుల రూపంలో ఖర్చు చేశారు. తామర పురుగు దెబ్బకు ఎకరానికి 8 నుంచి 15 క్వింటాళ్ల వరకు దిగుబడులు తగ్గినట్లు రైతులు వాపోతున్నారు. గత ఏడాది క్వింటా మిర్చి రూ.18,000 పలికితే ఈ ఏడాది క్వింటా మిరప కాయలు రూ.10 వేలు అమ్మడానికి రెండు రోజులు మిర్చి యార్డుకు తిరగాల్సిన దుస్థితి.


కల్లాల్లో ఆరుతున్న మిరపకాయలు, టిక్కీలు తొక్కుతున్న రైతులు

**పెరిగిన కూలీల రేట్లు..**

ఎకరం మిర్చి కోతకు రకం బట్టి ఏడుగురు నుంచి 10 మంది వరకు కూలీలు పడుతున్నారు. గ్రామాల్లో మిర్చి కోతలకు కూలీలు అందుబాటులో లేక పోవడంతో ఇతర గ్రామాల నుంచి కూడా మిరప కాయలు కోయడానికి వస్తున్నారు. గత ఏడాది రూ.300 ఉంటే రెండు మూడు రోజుల వరకు రోజు కూలీ రూ.400 ఉండగా ప్రస్తుతం రూ.450 నుంచి రూ.500 వరకు ఉంది. వీరికి ఆటో బాడుగ అదనంగా చెల్లించాలి.

**కౌలు రైతుల పరిస్థితి దైన్యం..**

మండలంలో 60 శాతం మంది కౌలు రైతులు మిర్చి సాగు చేస్తున్నారు. ప్రభుత్వ ఆర్థిక సాయం అందలేదు. దీంతో పాటు పెట్టుబడి పెరిగినప్పటికీ దిగుబడి తగ్గడం, మార్కెట్లో రోజురోజుకు ధరలు పతనం అవుతుండటంతో మిర్చి రైతన్నలు దిక్కుతోచకని స్థితిలో ఉండిపోతున్నారు. మిర్చి రకం బట్టి క్వింటాకు 11 వేల నుంచి నుంచి 13,500 రూపాయలు పలికిన ధరలు పడిపోవడంతో పెరిగిన పెట్టుబడులు, తగ్గిన దిగుబడులు పతనమవుతున్న మిర్చి ధరలకు తోడు పొలం కౌలు ధర చెల్లించడం అదనంగా మారింది. పంటను కాపాడుకునేందుకు బోరునీటిని ఒక్క తడికి 1500 రూపాయల చొప్పున కొనుగోలు చేస్తున్నట్లు పలువురు రైతులు చెబుతున్నారు.

**రైతుకు నష్టాలు తప్పవు**



ఈ ఏడాది మిర్చి రైతులకు నష్టాలు తప్పడం లేదు. పైరు కాపు దశలో ఉండగా నల్లి, తామర పురుగు, దోమ పైరును ఆశించడంతో దిగుబడులు బాగా తగ్గిపోయాయి. ప్రస్తుతం ఉన్న ధరకు మిరప కాయలు అమ్మితే గిట్టుబడి కాదు. ఎకరానికి 1.50 లక్షలు పెట్టుబడి పెట్టాల్సి వస్తుంది. ఇంత పెట్టుబడులు పెట్టినా లాభం లేకపోగా నష్టం వస్తుంది. రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి.

–కొండమడుగుల శ్రీనివాసరెడ్డి, మిరప రైతు, వెనిగండ్ల

**ధరలు పడిపోయాయి..**



మిరప కాయల ధరలు రోజు రోజుకూ పడిపోవడంతో ఎకరానికి 50 వేలు నష్టం. ఎకరం పొలం కౌలుకు తీసుకుని మిరప పంట సాగు చేశా. తీరా పంట పండే సమయానికి తెగుళ్లు ఆశించాయి. ఎన్ని మందులు పిచికారి చేసినా ముడత తగ్గలేదు. మిరప దిగుబడులు మాత్రం తగ్గిపోయాయి. కౌలుకు తీసుకుని మరీ సాగు చేశా. ప్రభుత్వమే గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలి.

–మైలా వెంకటేశ్వరరావు, మిరప రైతు

## క్లుప్తంగా

### బెల్లం ఊట ధ్వంసం



నిజాంపట్నం: నాటు సారా తయారీకి వినియోగించే బెల్లం ఊటను ధ్వంసం చేసిన సంఘటన మండలంలోని దిండి పంచాయతీ జంపనివారి పాలెం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. నగరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ శ్రీరామ్ ప్రసాద్ మాట్లాడుతూ తమకు అందిన సమాచారంతో జంపనివారిపాలెంలో తమ సిబ్బందితో దాడులు నిర్వహించామన్నారు. 100 లీటర్ల బెల్లం ఊట, 10 లీటర్ల నాటు సారా లభ్యమైనట్లు చెప్పారు. గ్రామ శివారులోని అడవుల్లో బెల్లం ఊటను ధ్వంసం చేసి నాటుసారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఒంగోలు ఎస్ఐలు రామారావు, రాజేంద్ర ప్రసాద్, సిబ్బంది తదితరులున్నారు.

### సత్తా చాటిన శ్రీచైతన్య విద్యార్థులు

బాపట్ల: బాపట్ల శ్రీచైతన్య విద్యార్థులు సత్తా చాటారని ప్రిన్సిపల్ పి.మోహనరావు తెలిపారు. సీనియర్ ఎంపీసీలో పి.శ్రీపవన్ ఎస్.నాగ అక్షయ, టి.కేతురవ్యాన్సి 989 మార్కులు సాధించారన్నారు. బైపీసీలో ఎ.లోహిత 986 మార్కులు పొందినట్లు చెప్పారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఏజీఎం దుర్గాప్రసాద్, డీన్ చంద్రశేఖర్, వేణుగోపాల్‌లు అభినందించారు.

### స్వధార్ హోంలో అనాథకు నిశ్చితార్థం



తెనాలిరూరల్: అనాథలు, వితంతు మహిళలకు ఆశ్రయం ఇచ్చే స్వధార్ హోంలో నివసించే యువతికి హోం నిర్వాహకులు వివాహం నిశ్చయించారు. తెనాలి శివారులోని జేఎంజే స్వధార్ హోంలో ఉంటున్న యువతి సుద్రికి హోం నిర్వాహకురాలు సిస్టర్ హృదయ మేరి వివాహం సంబంధాన్ని కుదిర్చారు. అనాథ అయిన సుద్రికి తేజసాయితో శనివారం నిశ్చితార్థం రిపించారు. అంగలకుదురుకు చెందిన గణేష్ యూత్ నిర్వాహకులు వీరవల్లి మురళి, ఉప సర్పంచ్ కనగాల నాగభూషణం, సభ్యులు హాజరై నూతన దంపతులకు వస్త్రాలను అందజేశారు. గణేష్ యూత్ ఆధ్వర్యంలో మూడో సారి అనాథ యువతికి వివాహం జరిపిస్తున్నట్టు వారు తెలిపారు.

### ప్రతి ఒక్కరూ సేవా నిరతి అలవర్చుకోవాలి



తెనాలిటౌన్: ప్రతి ఒక్కరూ సేవా నిరతి అలవర్చుకోవాలని శ్రీ ఆంజనేయ ధ్యాన యోగ మండలి నిర్వాహకులు కిషోర్ గురూజీ పిలుపునిచ్చారు. స్థానిక నాజర్‌పేటలోని మన ఇల్లు వృద్ధాశ్రమంలో శనివారం వృద్ధులకు సేవా కార్యక్రమం నిర్వహించారు. కిషోర్ గురూజీ పాల్గొని ఆశ్రమవాసులకు అల్పాహారం అందజేశారు. అనంతరం ధ్యానంపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తమకు ఉన్నంతలో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో దుపుగుంట్ల రమేష్‌బాబు, తాడికొండ శ్రీనివాసరావు, నాగరాజు, ఎం.శ్రీనివాసరావు, కోమల, సుజాత, రాణి, సుబ్బారావు, సత్యనారాయణ, కూరపాటి నాగరాజు, పలువురు యోగసాధకులు పాల్గొన్నారు.

### పేద చిన్నారులకు రొట్టెలు, పండ్లు పంపిణీ

తెనాలి అర్బన్: శ్యామ్ అండ్ జేన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యడ్లలింగయ్య కాలనీలో పేద చిన్నారులకు శనివారం పండ్లు, రొట్టెలు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ అలెగ్జాండర్ మాణిక్యం మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 150మంది విద్యార్థులకు వీటిని పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ విద్యార్థులు గుంటూరు రిధి, తన్మయ, రోధ, తేజస్విని, ఆర్.సృజ నారెడ్డి, తోట అవిలాష్, దొప్పలపూడి ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# జగనన్న కాలనీ అభివృద్ధికి కమిటీ

రేపల్లె రూరల్: జగనన్న కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం కాలనీ అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసినట్లు సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్ తెలిపారు. జగనన్న కాలనీలోని దేవుని చెట్టు వద్ద శనివారం కమిటీని ఎన్నుకున్న తర్వాత ఆయన మాట్లాడారు. కనీస వసతులు కల్పించటంలో పాలకులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారన్నారు. పట్టణంలోని వివిధ వార్డుల్లోని ప్రజలు జగనన్న కాలనీలో స్థిర నివాసాలు ఏర్పరుచుకున్నట్లు చెప్పారు. కనీస అవసరాలైన తాగునీరు, రహదారులు, డ్రెయిన్‌ల సదుపాయం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. అభివృద్ధి కమిటీ కన్వీనర్‌లుగా వీ.ధనమ్మ, కే.రవికుమార్, గౌరవాధ్యక్షుడుగా సీహెచ్ మణిలాల్, సహాయ కార్యదర్శులుగా కే.నాంచారమ్మ, అగస్టీన్, షేక్ ఫర్హానా, దుర్గాదేవి, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులుగా ఏ.పిచ్చయ్య, కే.వీరాంజనేయులు, కే.వెంకట్రావులు ఎన్నికయ్యారు.

# విభిన్న శరీరతత్వం కలిగిన మనిషి జీవితం

'అమ్మ చెక్కిన బొమ్మ' నాటిక


అమ్మ చెక్కిన బొమ్మ నాటికలో సన్నివేశం

తెనాలి: డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి స్మారక నాటక కళాపరిషత్, తెనాలి ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఇక్కడి ఓపెన్ ఆడిటోరియంలో ప్రారంభమైన జాతీయస్థాయి చతుర్థ ఆహ్వాన నాటికల పోటీల్లో తొలిగా గోవాడ క్రియేషన్స్, హైదరాబాద్ వారి 'అమ్మ చెక్కిన బొమ్మ' నాటికను ప్రదర్శించారు. విభిన్న ఇతివృత్తంతో ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ నాటిక ప్రేక్షకులను ఆలోచింపజేసింది. సమాజంలో స్త్రీ లేదా పురుషుడు కానివారిని అవమానించడం, గౌరవించకపోవటం, అసహ్యించుకోవటం మానవ జాతి దిగజారుడుతనానికి ఓ ప్రతీక అనే విషయాన్ని ఈ నాటిక ఎత్తిచూపింది. స్త్రీ, పురుషులే కాకుండా మానవజాతిలో దాదాపు 20 రకాల శరీర తత్వాలు కలిగిన మనుషులు ఉంటారనే విషయాన్ని గుర్తుచేసింది. విభిన్న శరీరతత్వ స్వభావం కలిగిన వారి గురించి పురాణాలు, చరిత్రలు పరిచయం చేస్తూనే వచ్చినా, చందమామపై నివాసం కోసం చూస్తున్న నేటి ఆధునిక సమాజంలో మనుషులు అలాంటి వారికి సముచిత స్థానాన్ని నిరాకరించటంలోని డొల్లతనాన్ని ఈ నాటిక ఎండగట్టింది. ఒక విభిన్న శరీరతత్వపు మనిషి జీవితంలోని కఠిన వాస్తవాలను నాటికలో ప్రదర్శించారు. జ్యోతిరాజ్ భీశెట్టి రచించిన ఈ నాటికను డాక్టర్ వెంకట్ గోవాడ దర్శకత్వంలో ప్రదర్శించారు. తెనాలి కళాకారుల సంఘం నిర్వహణలో ఆరంభమైన ఈ నాటికల పోటీలను గౌరవాధ్యక్షుడు ఆరాధ్యుల కన్నా, అధ్యక్షుడు అద్దేపల్లి లక్ష్మణశాస్త్రి, కార్యదర్శి పిట్టు వెంకట కోటేశ్వరరావు పర్యవేక్షించారు.

# ఘనంగా పేరంటాళ్లమ్మ తిరునాళ్లు

వల్లభాపురం(కొల్లిపర): మండల పరిధిలోని వల్లభాపురం గ్రామంలోని శ్రీ సర్విరెడ్డి పేరంటాలమ్మ దేవస్థానంలో అమ్మవారి కల్యాణం మహోత్సవం ,పేరంటాలమ్మ తిరునాళ్ల మహోత్సవాలు గ్రామంలో మూడు రోజులుగా భక్తులు ఘనంగా నిర్వహించారు.తిరునాళ్లను శనివారం ఆకరి రోజు కావటంతో మండలంలోని అనేక గ్రామాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు తమ కుటుంబసభ్యులతో పాల్గొన్ని అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి కల్యాణ మహోత్సవం, శిడిమాను మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.మహిళలు పెద్ద ఎత్తున పేరంటాళ్లమ్మ అమ్మవారికి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు.తిరునాళ్లలో ఎటువంటి ఆసాంఘితికి సంఘటనలు జరగకుండా ఎస్ఐ పి.కోటేశ్వరరావు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# డ్రెయిన్‌లో పూడికతీత పనులు వేగవంతం చేయాలి


రెడ్డిపాలెంలో డ్రెయిన్లను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు తదితరులు

గుంటూరు రూరల్: నగర పరిధిలో ప్రధాన డ్రెయిన్‌లో పూడికతీత పనులు వేగవంతం చేసి, వెంటనే పూర్తి చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. విద్యానగర్, నగరాలు, గోరంట్ల, రెడ్డిపాలెం తదితర ప్రాంతాలలో శనివారం పర్యటించారు. పారిశుద్ధ్య పనులు, ప్రధాన డ్రెయిన్లలో సిల్ట్ తొలగింపు పనులు, భవన నిర్మాణ అనుమతులు పరిశీలించి అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రధాన డ్రెయిన్లతో పాటు అంతర్గత రోడ్లలోని డ్రెయిన్లలోని పూడికతీత పనులు పక్కాగా నిర్వహించాలని కోరారు. వర్షాకాలం రాకముందే నగరంలోని ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్ల వెంబడి డ్రెయిన్లలో పూర్తి స్థాయిలో పూడికతీత పనులు పూర్తి చేయాలని చెప్పారు. పట్టణ ప్రణాళిక అధికారులతో సమన్వయం చేసుకొని, డ్రెయిన్లపై ఉన్న ర్యాంపులను తొలగించి నూరు శాతం పూడికతీత జరగాలన్నారు. పనులు చేపట్టకముందు, జరిగిన తరువాత ఫొటోలు, స్థానికుల సంతకాల వివరాలు అంచనాలతో పొందుపరచాలని సూచించారు. నగరంలో చెత్తకుప్పలు తొలగింపులో జాప్యంపై ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు వస్తున్నాయని, గత వారం నుంచి నైట్ శానిటేషన్ ద్వారా ప్రధాన రోడ్ల శుభ్రం పనులు ప్రారంభించామన్నారు. వార్డులలో ఉన్న చెత్తకుప్పలు కనపడకుండా ఎప్పటికప్పుడు తరలించాలని చెప్పారు. పర్యటనలో కార్పొరేటర్ కొమ్మినేని కోటేశ్వరరావు, ఏసీపీ రెహమాన్, ఎస్ఎస్‌లు సోమశేఖర్, ఐజాక్ పాల్గొన్నారు.

**అన్నా క్యాంటీన్ పరిశీలన**

అన్న క్యాంటిన్‌లలో ప్రతిరోజు నిర్దేశిత సమయంలో ఆహారం అందించాలని నగర కమిషనర్ పి.శ్రీనివాసులు సిబ్బందికి సూచించారు. నగరంలోని బస్టాండ్ వద్ద నున్న అన్నా క్యాంటిన్‌ను పరిశీలించి ఆహారం తీసుకుంటున్న వారితో మాట్లాడారు. అన్నా క్యాంటిన్‌లో రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి ఆహారం అందించాలన్నారు.

### విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

పొన్నూరు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో రాజ్యాంగం– అంబేడ్కర్ అనే అంశంపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. బీఎస్పీ, అంబేడ్కర్ యూత్ సంయుక్తంగా నిర్వహించిన ఈ పోటీలలో విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు. విజేతలకు ఈనెల 14 సాయంత్రం 6 గంటలకు జరిగే డాక్టర్ అంబేడ్కర్ జయంతి సభలో బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు ఎడ్లు శామ్యూల్ రాజ్, యాతాటి కిషోర్ తెలిపారు.

# సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలి

తెనాలి వెల్ఫేర్ డెవలెప్‌మెంట్ సొసైటీ సభ్యులు పిలుపు


సర్టిఫికెట్లు అందజేస్తున్న సొసైటీ సభ్యులు

తెనాలిటౌన్: మహిళలు సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని తెనాలి వెల్ఫేర్ డెవలెప్‌మెంట్ సొసైటీ సభ్యులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కొత్తపేటలోని ఇన్ఫర్మేటిక్స్ కంప్యూటర్ ఇనిస్టిట్యూట్‌లో ఉచిత కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గోపాలం స్వాతి పాల్గొని 25 మంది మహిళలకు శిక్షణ సర్టిఫికెట్లను అందజేశారు. మహిళలు కుటుంబ ఉన్నతికి ఆర్థికంగా తోడ్పాడలంటే నేటి సమాజంలో కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి అని తెలియజేశారు. తెనాలి వెల్ఫేర్ డెవలెప్‌మెంట్ సొసైటీ మహిళలకు ఉచిత శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసి అవసరమైన సర్టిఫికెట్లు అందించడం అభినందనీయమని సభ్యుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కటకం వెంకటప్రసాదరావు, వి.శ్రీనివాస్‌రెడ్డి, ఎం.ప్రభాకరరావు, సునీల్, అచ్యుత సాంబశివరావు, దీప్తి, రాణి పాల్గొన్నారు.

# దాడి ఘటనలో పరస్పర కేసులు

కొల్లూరు: దాడి ఘటనలో పరస్పరం అందిన ఫిర్యాదుల మేరకు కొల్లూరు పోలీసులు కేసులు నమోదు చేసిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని చింతర్లంకలో ఉన్న తన పొలానికి పెదలంకకు చెందిన ఉప్పు వెంకటేశ్వరరావు వెళుతున్నాడు. ఆ సమయంలో చింతర్లంకకు చెందిన తోడేటి సురేష్ బాబు తాను ముద్దాయిగా ఉన్న పాత కేసులో సాక్షులుగా ఉన్న వెంకటేశ్వరరావు కుమారులను తనకు అనుకూలంగా సాక్ష్యం చెప్పాలని బెదిరించాడు. వెంకటేశ్వరరావు సంబంధం లేదని చెప్పి వెళ్లిపోతుండగా, దాడి చేయడంతో గాయపడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనలో తోడేటి సురేష్ బాబు తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో చేసిన ఫిర్యాదు ఆదారంగా కేసు నమోదైంది. ఎస్సీ కులానికి సురేష్ బాబు ఇంటికి వెళ్లి పెదలంకకు చెందిన ఉప్పు వెంకటేశ్వరరావు, అతని ఇద్దరు కుమారులు గొడవ పడ్డారు. అనంతరం సురేష్ పొలం వెళ్లి తిరిగి ఇంటికి వచ్చే సమయంలో దాడి చేశారు. ఇరువురు ఇచ్చిన ఫిర్యాదులపై కేసులు నమోదు చేశామని తెలిపారు.

### వైభవంగా వేణుగోపాల స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు



పొన్నూరు: మండల పరిధిలోని కసుకర్రులోని వేణుగోపాల స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శనివారం ఆలయ వంశపారంపర్య అర్చకులు విజితేంద్ర, స్వామిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిత్యోపాసనం, గరుడోత్సవం, సాయంత్రం రథోత్సవం అంగరంగ వైభవంగా జరిపించారు. కార్యక్రమంలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


# బైక్ చోరీలకి పాల్పడిన వ్యక్తి అరెస్టు

పట్నంబజారు: ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. గుంటగ్రౌండ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈస్ట్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్, కొత్తపేట ఎస్‌హెచ్‌ఓ ఎం.వీరయ్యచౌదరి వివరాలు వెల్లడించారు. పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం కోనూరు గ్రామానికి చెందిన కోట అఖిల్‌కుమార్ గుంటూరు నగరంలోని రైలుపేటలో గౌలుసు నాంచారమ్మ హైస్కూలు వద్ద తన స్నేహితులతో కలసి రూము అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. అమెజాన్‌లో డెలివరీ బోయ్‌గా పనిచేస్తున్నాడు. సులభతరంగా సంపాదించాలని ఉద్దేశంతో చోరీలు చేయడం ప్రారంభించారు. పక్కా సమాచారం అందుకున్న పోలీసులు ఈనెల 11వ తేదీ రాత్రి రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే క్వార్టర్స్ ఎంట్రన్స్ వద్ద ఎస్ఐ డి.రమేష్, సిబ్బందితో వెళ్లగా నిందితుడు పరారయ్యేందుకు ప్రయత్నించాడు. అఖిల్‌ను పట్టుకుని తమదైన శైలిలో విచారించగా, ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్నట్లు అంగీకరించాడు. రూ.12 లక్షల విలువ చేసే 20 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. సుమారు పది కేసులు నిందితుడిపై నమోదు అయినట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన సిబ్బందిని అభినందించారు.

### కొనసాగుతున్న కృపా మహాసభలు

గుంటూరు రూరల్: క్రీస్తుని రాకడ సమీపించుచున్నదని ఆయన భక్తులు ఆయన కోసం సిద్ధంగా ఉండాలని కృపా మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రదర్ మ్యాథ్యూస్ తెలిపారు. గత రెండు రోజులుగా నల్లపాడు రోడ్డులోని హౌసింగ్‌బోర్డ్ కాలనీ ఎదురుగా సుమారు వంద ఎకరాల విస్తీర్ణంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ కృపా మహాసభలు మూడో రోజు శనివారం కొనసాగాయి. మహాసభలను బ్రదర మ్యాథ్యూస్ ప్రత్యేక ప్రార్థనలు చేసి ప్రారంభించారు. మహాసభల నూతన పాటలను ఆలపించారు.

### భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి వేడుకలు



పెదకాకాని: భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి వేడుకలు శనివారం నిర్వహించారు. పెదకాకాని మండలంలోని ఆయా గ్రామాల్లో హనుమత్ జయంతి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయానే ఆలయాలకు చేరుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పెదకాకాని వై జంక్షన్‌లో ఉన్న అభయాంజనేయ స్వామి దేవస్థానంలో ఆంజనేయ స్వామికి అభిషేకపూజలు, ఆకు పూజలు నిర్వహించారు. చందనంతో స్వామి వారిని అలంకరించారు. అర్చకులు భక్తులకు గోత్రనామ పూజలు చేసి ఆశీర్వచనము అందజేశారు. ఆలయానికి వచ్చిన భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

### వైభవంగా మహాలక్ష్మి గుండెపాటమ్మ తిరునాళ్ల


అమ్మ వారికి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

రేపల్లె రూరల్: మండలంలోని పేటేరు గ్రామ దేవత మహాలక్ష్మి గుండెపాటమ్మ అమ్మ వారి తిరునాళ్ల శనివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి వేకువజామునే సుప్రభాత సేవలతో పంచామృతాలు, పండ్ల రసాలతో అభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజలు చేశారు. యజమానులు తమ పశువులను అమ్మవారి చుట్టూ ప్రదక్షిణలు చేయించి మొక్కుబడులు తీర్చుకున్నారు. పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలు, చద్ది నైవేద్యాలు సమర్పించా. ఆలయ ఆవరణంలో భక్తులు ప్రభలను ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.